క్లుప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీలో తడిపొడి చెత్తను ఏరోజుకారోజు ఎత్తివేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. మంగళవారం పట్టణంలోని 38వ వార్డు ఎరుకల కాలనీ, 41వ వార్డు బోయగేరి, పాత బస్టాండు సర్కిల్‌లోని అన్నా క్యాంటీన్‌లను ఆయన పరిశీలించారు. మురుగు కాలువల్లోని పూడికతీత పనులు, ప్రధాన కూడళ్లలో తడిపొడి చెత్తను ఎత్తివేసే పనులను తనిఖీ చేశారు.

ఘనంగా లెనిన్ జయంతి



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ (ఎంఎల్) నాయకులు

ఆదోని రూరల్: పట్టణంలోని తిక్కస్వామి దర్గా వద్ద లెనిన్ 155వ జయంతిని, సీపీఐ(ఎంఎల్) 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి కె.నాగరాజు, డివిజన్ కార్యదర్శి చెన్నకేశవులు ఆధ్వర్యంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి కె.సోమశేఖర్, ఐఎఫ్‌టీయూ నాయకులు బాషా, షాషావలి, హుసేన్, శివరాములు పాల్గొన్నారు.

కల్లుదేవ కుంట పీహెచ్‌సీ తనిఖీ



హాస్పిటల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి భాస్కర్

మంత్రాలయం: మండలంలోని కల్లుదేవ కుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా అదనపు వైద్యాధికారి భాస్కర్ తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో ఉన్న వివిధ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఎన్‌సీడీ–సీడీ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. అందుకు సంబంధించిన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ గోవిందమ్మ, సీహెచ్‌ఓ వెంకటలక్ష్మి, పీహెచ్‌ఎన్ రాణి, సూపర్ వైజర్స్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని కోట్ల కూడలిలో మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో 12 మందికి గాయాలయ్యాయి. మంగళవారం కూలీ పనుల కోసం ఇందిరానగర్, రాజీవ్‌గాంధీనగర్ నుంచి 11 మంది మహిళా కూలీలతో హెబ్బటం గ్రామానికి వెళ్తున్న ఆటో కోట్ల కూడలిలో ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఇందులో 11 మంది మహిళా కూలీలకు గాయాలు కాగా, దేవమ్మ అనే మరో మహిళలకు తీవ్ర గాయాలయ్యాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు దేవమ్మను మెరుగైన వైద్య కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

మాటల్లో దింపి.. నగదుతో ఉడాయింపు

హొళగుంద: మండల పరిధిలోని చిన్నహ్యాట గ్రామం ఆలూరు రోడ్డులోని ఓ కిరాణ దుకాణంలో వ్యాపారిని మాటల్లో దింపి నగదు తీసుకుని ఉడాయించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు వడ్డె ఉరుకుంద కుమారుడు వీరాంజనేయులు తెలిపిన వివరాలు.. మధ్యాహ్నం ఉరుకుందను దుకాణంలో కూర్చోబెట్టి కుమారుడు వీరాంజనేయులు భోజనానికి వెళ్లాడు. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి ఉరుకుందను మాటల్లో దింపి చాకచక్యంగా రూ.6 వేల నగదు తీసుకుని ఉడాయించారు. అనంతరం తండ్రీకుమారుడు సీసీ ఫుటేజీని పరిశీలించి చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తిప్పన్న తాత ఉత్సవాలు ప్రారంభం



ఆస్పరి: మండలంలోని చిగిళిలో వెలసిన శ్రీగిరి కట్టెల తిప్పన్న తాత ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో తిప్పన్న తాతకు గంగ, ఆకుపూజ, మంగళహారతులు నిర్వహించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. బుధవారం ఉదయం ప్రభోత్సవం, సాయంత్రం రథోత్సవం, గురువారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రాధాక్రిష్ణ చెప్పారు.



గుంతలమయంగా పొదలకుంట - హాల్వి రోడ్డు



ముళ్లకంపతో మూసుకుని పోయిన రోడ్డు

5 కిలో మీటర్లు.. అరగంట ప్రయాణం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం నుంచి హాల్వి వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు ఆయకట్టు రోడ్డును తలపిస్తోంది. ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోవడంతో దారి అంతా మసుకుపోయింది. ప్రధానంగా పొదలకుంట నుంచి హాల్వి వరకు ఉన్న రోడ్డు దారుణంగా ఉంది. ఈ రోడ్డుపై 5 కిలో మీటర్ల ప్రయాణానికి అరగంట సమయం పడుతోంది. ఎటూ చూసిన గుంతలు పడి కంకర తేలింది. చాలా చోట్ల అడుగు, రెండు అడుగుల వరకు గుంతలు ఉండడంతో రోడ్డుపై ప్రయాణం చాల కష్టంగా మారింది. ఈరోడ్డుపై ఉన్న గుంతాలను దాటుకుని వెళ్లాలంటే వాహనదారులకు కష్టంగా మారింది. ఇక కల్వర్టుల వద్ద కొన్ని చోట్ల ఇరువైపులా కంప చెట్లు పెరిగి రోడ్డుకు అడ్డంగా ఉండడంతో దారి మూసుకుని పోయింది. ప్రభుత్వం స్పందించి పెరిగిపోయిన కంపచెట్లను తొలగించి రోడ్డును పూర్తిగా వేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

గంజిళ్ల రోడ్డు.. గుంతలమయం

ఎమ్మిగనూరుటౌన్: నిత్యం వాహనాల రాకపోకలతోను, ప్రజలతోను రద్దీగా వుండే పట్టణంలోని గంజిళ్ల రోడ్డు శిథిలం కావడంతో ఇటు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్డుపై వున్న గోతుల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఆటంకం కలిగిస్తోంది. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి కర్నూలు ప్రధాన రహదారిలోని ఎద్దుల మార్కెట్ వరకు రహదారి మొత్తం శిథిలం కావడంతో రోడ్డుపై ఉన్న గోతుల వద్ద నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. రోడ్డుకు సమీపంలోనే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలుండటంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల ఆటోలు సైతం ఈ రోడ్డుపైనే వస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఈ రోడ్డును పునర్ నిర్మించి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

శిథిలమైన గంజిళ్ల రోడ్డు →



పిల్లల సంరక్షణే లక్ష్యంగా పని చేయాలి

నందవరం : అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల సంరక్షణే లక్ష్యంగా పని చేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) పి. నిర్మల అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ సఫరున్నీసా బేగం ఆధ్వర్యంలో పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాశన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు గాజులు, పండ్లు, జాకెట్ అందించి ఐసీడీఎస్ అధికారులు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలో అందించే పౌష్టి కాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే పిల్లల మొదటి వెయ్యి రోజులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుధావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భిణులకు అక్షింతలు వేసి ఆశీర్వదిస్తున్న పీడీ పి. నిర్మల

కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి

ఎమ్మిగనూరురూరల్: కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హనీఫ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హనీఫ్, రైత కూలీ సంఘం జిల్లా కార్యదర్శి యేసుపు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం మార్చి వేస్తోందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతుందని ఆరోపించారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు కిష్టప్ప, రామలింగ, చిన్నరాజు, స్వామి, రైతు కూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు

ఎమ్మిగనూరురూరల్: సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయం ఆవరణ లో పార్టీ జెండావిష్కరించారు. న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు సత్యన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను పథకాలతో మభ్యపెడుతున్నాయని చెప్పారు. మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగర్ పేరుతో ఆదివాసులు, గిరిజన హక్కుల కోసం పోరాటం చేస్తున్నవారిని చంపివేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు, బాబు, పీవైఎల్ డివిజన్ కన్వీనర్ మునెప్ప, పార్టీ నాయకులు మల్లికార్జున, ఖాజ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

స్టాంపుల కొరత లేకుండా చూడాలి

ఆదోని టౌన్: ఆదోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల కొరత రోజురోజుకు అధికమవుతుందని మంగళవారం సబ్‌రిజిస్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ, ఏపీ రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావి రాజు, ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి మదిరి యల్లప్ప, సత్యనారాయణ, గంగన్న తదితరులు మాట్లాడుతూ స్టాంపుల కొరతతో అధిక ధరలను వెచ్చించి కొనాల్సి వస్తోందన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు నిత్యం ప్రదక్షిణలు చేస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం ఏశారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, మాజీ సర్పంచ్ హనుమంతు, చిన్నపెండేకల్ హనుమంతు పాల్గొన్నారు.

తప్పలుంటే సరిదిద్దుకోండి

మద్దికెర : మద్దికెర ఉత్తరం రెవెన్యూ పరిధిలో సాగు భూములు ఉన్న రైతులు పట్టదారు పాస్‌బుక్‌లో సెల్ నంబర్, ఆధార్‌కార్డు మార్పు చేసుకోదలిచిన వారు చేసుకోవచ్చని తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్ మంగళవారం తెలిపారు. అన్నదాతలు అడంగల్‌లో తప్పలున్నా, పొలం కొనుగోలు చేసి నమోదు చేసుకోలేని వారు సర్వే నెంబర్ తప్పుగా వున్నా సంబంధిత వీఆర్వోను సంప్రదించి మ్యూటేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హాలహర్వి: మండలంలోని చింతకుంట–కామినహాల్ రహదారిలోని ముళ్ల కంపల్లో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న 12 మందిపై రైడ్ చేసినట్లు ఎస్ఐ చంద్ర తెలిపారు. వారిలో 10 మందిని అరెస్ట్ చేయగా ఇద్దరు పరార్ అయ్యారన్నారు. నిందితుల నుంచి 8 బైకులు, ఆరు సెల్‌ఫోన్‌లు, రూ.92,750 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో పోలీసులు అయ్యన్నస్వామి, వీరారెడ్డి, రాజశేఖర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ప్రతి కార్డుదారుడికి ఈ-కేవైసీ తప్పనిసరి

తుగ్గలి : ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని పొందేందుకు రేషన్‌కార్డులోని ప్రతి సభ్యుడు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. మండలంలో మొత్తం 60,499 మంది సభ్యులకు గాను మంగళవారం నాటికి 3,949 మంది సభ్యులు ఈ–కేవైసీ చేయించు కోవాల్సి ఉందన్నారు. లబ్ధిదారుల వివరాలు రేషన్ షాపు డీలరు వద్ద ఉన్నాయన్నారు. గ్రామ సచివాలయం, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్ లాగిన్ ద్వారా అందుబాటులో ఉన్న ఈ–పోస్ పరికరాల ద్వారా ఈనెలాఖరులోపు ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

డీఎస్సీకి వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలి

కర్నూలు(సెంట్రల్): డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితిన 47 ఏళ్లకు పెంచాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు రామన్న, నగేష్ డిమాండ్ చేశారు. మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బిర్లాగేటు సమీపంలో డీఎస్సీ అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కొన్ని కఠినతరమైన నిబంధనలు ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు. ముఖ్యంగా డీఎస్సీ పరీక్షలను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో జిల్లా యూనిట్‌గా తీసుకొని నిర్వహించాలన్నారు. ఎక్కువ సిలబస్ ఉండడంతో పరీక్షకు 70–90 రోజుల వ్యవధి ప్రిపరేషన్ కోసం ఇవ్వాలన్నారు. జూన్ 16–26 మధ్య ఏపీపీఎస్‌సీ పరీక్షలు ఉండడంతో రెండు పరీక్షలు రాసే అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీలలో కచ్చితంగా 45 శాతం వచ్చి ఉండాలనే నిబంధనను తొలగించాలని కోరారు.



ఆందోళన చేపట్టిన డీఎస్సీ అభ్యర్థులు

పోప్ ఫ్రాన్సిస్ సేవలు మరువలేనివి



పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులర్పిస్తున్న బిషప్ గోరంట్ల జ్వాన్నేష్

కర్నూలు (టౌన్): క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ సేవలు మరువలేనివని కర్నూలు డయాసిస్ బిషప్ గోరంట్ల జ్వాన్నేష్ కొనియాడారు. మంగళవారం నంద్యాల చెక్‌పోస్టులోని సెయింట్ లూర్దుస్ కథిడ్రల్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ దైవసందేశం ఇస్తూ.. పోప్ ఫ్రాన్సిస్ మరణం క్యాథలిక్ సమాజానికి తీరని లోటన్నారు. ఆయన పోప్‌గా బాధ్యతలు స్వీకరించిన క్షణం నుంచి తుదిశ్వాస వరకు ప్రపంచశాంతి, నవ సమాజ నిర్మాణం కోసం కృషి చేశారన్నారు. క్యాథలిక్ చర్చిలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎన్నో దేశాల మధ్యన యుద్ధ వాతావరణం నెలకొన్నప్పుడు అనుసంధానకర్తగా వ్యవహరించి శాంతి వెల్లి విరిసేలా కృషి చేశారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సెయింట్ లూర్దుస్ కథిడ్రల్ చర్చి ఫాదర్ సిద్ధిపోగుల దేవదాసు, కార్యదర్శి ఫాదర్ ప్రవీణ్, పాస్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మాదిగలకు 7 శాతం రిజర్వేషన్ కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానాన్ని సవరించి మాదిగలకు 7 శాతం రిజర్వేషన్‌ను కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఎస్సీ వర్గీకరణలో రోస్టర్‌ను సవరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానాన్ని అనుసరించి రెల్లి ఉపకులాలకు 1 శాతం, మాదిగ, ఉప కులాలకు 6.5 శాతం, మాల, ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్‌ను కల్పించినట్లు చెప్పారు. అయితే ఈరోస్టర్‌ను సవరించకపోతే మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. మాదిగ, మాల ఉప కులాలకు 7 శాతం చొప్పున విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బైరాపురం రాజు, సూరిబాబు, విహార్, రాజశేఖర్, లక్ష్మన్న, నాగరాజు, మీసాలదాసు పాల్గొన్నారు.

ఎండలు బాబోయ్.. ఎండలు!



12 గంటలకు నిర్మానుష్యంగా మారిన ఎమ్మిగనూరు-కర్నూలు ప్రధాన రహదారి

గోనెగండ్ల: ఈ వేసవిలో రోజు రోజుకు ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 11.30 దాటితే జనం బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఎండ తీవ్రత 39 డిగ్రీలు దాటి పోతోంది. దీంతో ప్రధాన రహదారులు, వీధులు నిర్మానుష్యంగా మారిపోయాయి. ఎమ్మిగనూరు–కర్నూలు ప్రధాన రహదారి 12 గంటలకే నిర్మానుష్యంగా మరింది. మధ్యాహ్నం ఒంట గంటకు వీధులలో జనంతో పాటు పశుపక్షాదులు కూడా తిరగడం లేదు. ఏప్రిల్ నెలలోనే ఈ విధంగా ఎండలు మండిపోతుంటే ఇక మే నెలలో ఎండ తీవ్రత ఎంత ఉంటుందో అని జనం ఆందోళన చెందుతున్నారు.

ఎండ తీవ్రత.. మూగజీవాలు విలవిల



ఎండవేడిమి తట్టుకోలేక చెట్టు కింద సేదతీరుతున్న ఎద్దులు, ఆవులు

కౌతాళం: రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతకు ఇటు జనాలు అటు మూగజీవాలు వేడిమిని తట్టుకోలేక అల్లాడుతున్నారు. వారం రోజులుగా మండలంలో 40 నుంచి 43డిగ్రీలకు తగ్గకుండా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఎండల తీవ్రత నానాటికి పెరిగి పోతుండటంతో మంగళవారం మండల పరిధిలోని గొతులదొడ్డి గ్రామం శివారు పొలాల్లో ఎద్దులు, ఆవులు మధ్యాహ్నం ఎండల తీవ్రతను తట్టుకోలేక ఎపుగా పెరిగిన కంప చెట్టు కింద సేదతీరడం కనిపించింది.

హెల్త్ సూపర్‌వైజర్లకు పదోన్నతి కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): కడప జోనల్ పరిధిలో పలువురు హెల్త్ సూపర్‌వైజర్లకు పీహెచ్‌ఎన్‌లుగా మంగళవారం కడపలోని ప్రాంతీయ ఆరోగ్య సంచాలకుల కార్యాలయంలో ఆర్‌డీ డాక్టర్ రామగిడ్డయ్య ఆధ్వర్యంలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. జోనల్ పరిధిలో 22 మందికి కౌన్సెలింగ్ నిర్వహించగా 18 మంది పదోన్నతి పొందారు. ఇందులో సి.రామక్క హొళగుంద పీహెచ్‌సీకి, నాగలక్ష్మమ్మ వేల్పనూరుకు, మాణిక్యమ్మ మద్దూరుకు, ఆర్. ప్రభావతి కొత్తపల్లికి, ఏడీ. ఇంద్రధోరతి పలుకూరుకు బదిలీ అయ్యారు. వీరితో పాటు కర్నూలు జిల్లాకు చెందిన హేమలత అనంతపురం జిల్లా బి. పప్పూరు, శ్యామలాదేవి పాల్తూరు పీహెచ్‌సీలకు బదిలీ అయ్యారు.

ఎంపీహెచ్‌ఏ(ఎం)ల సీనియారిటీ జాబితా

పని సర్దుబాటు కోసం వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న 46 మందితో ఎంపీహెచ్ఏ(మేల్)ల సీనియారిటీ జాబితాను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ విడుదల చేశారు. ఈ జాబితాపై రెండు రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని అందులో సూచించారు. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి డెంగీ, మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో సర్దుబాటు చేయనున్నారు.

సంప్రదాయ ఇంధన వనరుల వాడకం తగ్గించాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు సంప్రదాయ ఇంధన వనరుల వాడకం తగ్గించాలని సెట్కూరు సీఈవో డాక్టర్ కె.వేణుగోపాల్ చెప్పారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా యువజన సంక్షేమ శాఖ (సెట్కూరు) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కర్నూలు మండలం పసుపుల గ్రామంలోని శ్రీహరి అగ్రికల్చర్ అండ్ పాలిటెక్నిక్ కాలేజీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్కూరు సీఈవో డాక్టర్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ సౌరశక్తి వినియోగం కోసం ప్రభుత్వం అందించే వివిధ పథకాలను తప్పకుండా ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి బయోడిగ్రేడబుల్ వస్తువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. అటవీ శాఖ తరుపున సంఘ మిత్ర, అనిమల్ ఫౌండేషన్ సభ్యులు మహ్మద్ ఇద్రిస్ మాట్లాడుతూ వన్యప్రాణులను సంరక్షించుకోవడం మన బాధ్యత అని, అడవులను వన్యప్రాణులను కాపాడుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను సాధించగలుగుతామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, సెట్కూరు సూపరింటెండెంట్ శ్యామ్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో డాక్టర్ కె.వేణుగోపాల్

సర్వేను అడ్డుకున్న రైతులు

పత్తికొండ రూరల్ : మండల పరిధిలోని చిన్నహుల్తి గ్రామ సమీపంలోని సర్వేనం 167లో మంగళవారం రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేను రైతులు అడ్డుకున్నారు. మోద్దీన్ అనే వ్యక్తి ఈభూమి తనది అని తహసీల్దారుకు విన్నవించుకోవడంతో మండల సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్‌ఓ రంగస్వామి, గ్రామ సర్వేయర్ నాగేంద్రనాయక్‌లు సర్వే చేసేందుకు వెళ్లారు. అయితే ఈపొలాన్ని తమ పూర్వికుల నుంచి సాగుచేసుకుంటున్నామని, రెవెన్యూ అధికారులు కూడా అనుభవంలో ఉన్నట్లుగా తమకు అనుభవదారు పట్టా ఇచ్చారని రైతులు శ్రీరాములు, రంగస్వామి రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. సర్వే చేయనీయమని రైతులు అడ్డుకోవడంతో రెవెన్యూ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ భూమికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తుందని, ఎవరూ ఈభూమిలోకి ప్రవేశించరాదని తహసీల్దారు బోర్డును ఏర్పాటు చేశారు.

25న ఆన్‌లైన్‌లో మోడల్ ఈఏపీసెట్

కర్నూలు సిటీ: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన ఆన్‌లైన్‌లో మోడల్ ఈఏపీసెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ సంఘం నగర నగర కార్యదర్శి సాయి ఉదయ్, నగర ఉపాధ్యక్షులు ఆర్యన్, పృధ్వి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో ఆన్‌లైన్ నిర్వహిస్తున్నామన్నారు.

వేసవి దుక్కి.. రైతన్నకు లాభసాటి

- రబీ సీజన్ ముగియడంతో వేసవి దుక్కులకు శ్రీకారం చుట్టిన అన్నదాతలు
- లోతు దుక్కులతో ఎన్నో లాభాలు
- చీడ పురుగుల నివారణకు ఆస్కారం
- దిగుబడులు పెరిగేందుకు దోహదం

నందవరం : రబీ సీజన్ ముగియడంతో రైతన్నలు వేసవి దుక్కులకు శ్రీకారం చుట్టారు. వీటినే లోతు దుక్కులను వేసవి దుక్కులుగా పేర్కొంటారు. వేసవి దుక్కుల విషయంలో రైతులు జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. చీడ పురుగులు, కలుపు మొక్కల నివారణకు ఈ దుక్కులు దోహదపడతాయి. భూసారంతోపాటు తేమశాతం పెంచేందుకు ఆస్కారం ఉంటుంది. పెట్టుబడులు తగ్గడలతో పాటు మంచి దిగుబడులు సాధించడానికి వేసవి దుక్కులు దోహదపడుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

వేసవి దుక్కులు చేసుకునే విధానం

పంటల సాగును బట్టి దుక్కులు చేసుకోవాల్సి ఉంటుంది. వేరు వ్యవస్థ లోతుగా ఉండే పంటలకు (ఉదా.. కంది, ఆముదం, పత్తి) 25–30 సెంటీమీటర్ల లోతు దున్నుకోవాలి. సాధారణ వేరు వ్యవస్థ కలిగిన పైర్లకు (ఉదా.. వేరుశనగ, జొన్న, మొక్కజొన్న) 15–20 సెంటీమీటర్ల లోతు దున్నితే సరిపోతుంది. వేసవి దుక్కులకు మోల్డ్‌బోర్డు నాగలి (తిరగలి నాగలి, రెక్కల నాగలి)ని వినియోగించుకోవడం మంచిది. ఏటవాలు భూముల్లో వాలుకు అడ్డంగా దున్నాలి.

దుక్కులతో ప్రయోజనాలు

మండలంలో అత్యధికంగా నల్లరేగడి, ఎర్ర నేలలు ఉన్నాయి. పత్తి పంట ఎక్కువగా సాగు చేయడంతో లోతు దుక్కులు కచ్చితంగా చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో లోతు దుక్కులు దోహదపడతాయన్నారు.



ఎర్ర రేగడి పొలంలో తిరగలిమడకతో దుక్కి దున్నుతున్న రైతు

- నేలపొరలు విచ్చిన్నం కావడంతో నేలలో గాలితో పాటు తేమశాతం పెరిగి మేలుచేసే సూక్ష్మ జీవుల సంతతి మెరుగుపడుతుంది.
- రబీ సీజన్‌లో మిగిలిన కలుపు మొక్కలు, వేర్లు, చెత్తా చెదారాలు మట్టిలో కలియడం, సూర్యరశ్మి సోకడంతో నిద్రావస్థలో ఉన్న చీడ పురుగులు నశిస్తాయి.
- సేంద్రియ పదార్థాలు విడిపోయి త్వరగా పోషకాలుగా మారుతాయి.
- వాలుకు అడ్డంగా దున్నడంతో నేల కోతకు గురికాకుండా నీరింకిపోవడానికి ఆస్కారం ఉంటుంది.
- పురుగు మందుల అవశేషాలు సూర్యరశ్మికి ఆవిరై నేలకు హానికరం తగ్గుతుంది.
- మొండిజాతికి చెందిన తుంగజాతి కలుపు మొక్కల బెడద దాదాపు తొలగిపోతాయి.
- నేలల్లో మిట్టి రేణువులు 50 శాతం, నీరు 25 శాతం, గాలి 25 ఉంటుంది. సమపాలల్లో ఉండాలంటే ఈ దుక్కులు తప్పనిసరి.
- భూమి గుల్లబారడంతోపాటు పైర్ల వేరువ్యవస్థ వృద్ధి చెంది మొక్క ఆరోగ్యకరంగా పెరుగుతుంది.
- మొక్కకు పోషకాలు అందేందుకు ఎలాంటి అవాంతరాలు ఉండవు.



భూసార పరీక్షలు అవసరం

లోతు దుక్కులు చేసుకోవడంతోపాటు ఇదే సమయంలో రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవడం మంచిది. భూసారాన్ని బట్టి ఆమ్ల, క్షార ధాతువులు, సూక్ష్మ పోషకాల శాతాలు తెలుసుకోవచ్చు. పరీక్షలకు అనుగుణంగా రసాయన, సేంద్రియ ఎరువులు వాడుకోవచ్చు. తద్వారా పెట్టుబడులు దాదాపుగా తగ్గించుకోవచ్చు. ఇదే సమయంలో సేంద్రియ ఎరువులు నేలలో చల్లుకోవాలి. దున్నకాలతో సేంద్రియ పదార్థాలు విచ్చిన్నమై త్వరగా నేల సారం పెరిగేందుకు దోహదపడతాయి. ఘనజీవామృతం, డీకంపోజర్ నేలల్లో చల్లుకోవడంతో సూక్ష్మజీవుల సంతతి పెరుగుతుంది. ఇప్పటికే మండలంలోని రైతులకు వేసవి దుక్కుల ప్రాధాన్యతను వివరించడం చేస్తున్నాం.

– మద్రి స్రవంతి, వ్యవసాయాధికారిణి, నందవరం